మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్) : మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) మూడో విడత పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఆసరా పథకం ద్వారా వీరవాసరం మండలానికి రూ.11 కోట్ల 88 లక్షలు, భీమవరం మండలానికి రూ.17 కోట్ల 85 లక్షలు, భీమవరం పట్టణానికి రూ.10 కోట్ల 80 లక్షల నగదును డ్వాక్రా మహిళల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా డ్వాక్రా మహిళలను, రైతులను మోసం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం మానేసి ఎమ్మెల్యేలను కొనుగోళ్లు చేసే నీచమైన రాజకీయలను చంద్రబాబు నాడు నేడు కూడా చేశాడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు కలిగే కార్యక్రమాలు చేస్తుంటే తట్టుకోలేక తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టిందుకు ప్రయత్నిస్తున్నాడని, 2019 మాదిరిగానే 2024లో కూడా రాష్ట్ర మహిళలు ఎన్నికల సమయంలో చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

రాజధాని పేరుతో మోసం చేసిన చంద్రబాబు

హైదరాబాద్‌లో కోటి 20 లక్షల మంది జనాభా ఉన్నారని, విశాఖపట్నంలో సుమారుగా 30 లక్షల మంది జనాభా ఉన్నారని, చంద్రబాబు ఏర్పాటు చేసిన రాజధాని అమరావతిలో కనీసం మూడు లక్షల మంది జనాభా కూడా లేరని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే కనీసం విశాఖపట్నంలో మాదిరిగా జనాభా ఉండాలని, అందుకే 30 లక్షల మంది జనాభాతో రాజధాని ప్రారంభమైతే, రానున్న కాలంలో హైదరాబాద్ స్థాయిలో రాజధాని అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు కేవలం ప్రజలను మోసం చేయడానికి 30 వేల ఎకరాలలో అమరావతి రాజధాని అని చెబుతూ భూములను తన అనుచరులకే కట్టబెట్టారని విమర్శించారు. చంద్రబాబు కేవలం ప్రచారంతోనే పాలన చేశారని ఆయన హయాంలో రాజమండ్రి పుష్కరాల్లో ఆయన చేసిన ప్రచార హడావిడికి ఆనాడు 27 మంది భక్తులు చనిపోయారని గుర్తు చేశారు. ఇటీవల ఆయన బహిరంగ సభలలో కూడా పలువురు మరణించిన విషయం తెలిసేందన్నారు. చంద్రబాబు అంటేనే మోసమని, ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు చంద్రబాబుకు లేదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, నల్లం రాంబాబు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కోడే యుగంధర్, చెల్లబోయిన సూర్య ప్రకాష్, వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, కందికట్ల ఎడ్వర్డ్, కైలా పాండురంగారావు, పాలవెల్లి మంగ, ముద్దల కరుణ్ కుమార్, కోమటి రాంబాబు, కొల్లి ప్రసాద్, నందమూరి ఆంజనేయులు, జంగం మాణిక్యాలరావు, పెచ్చేటి ప్రసాద్, గాదిరాజు రామరాజు, సమాఖ్య అధ్యక్షులు, డ్వాక్రా ఆర్పీలు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారిని దర్శించుకుంటున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

భీమవరం(ప్రకాశంచౌక్) : భీమవరం సుంకర పద్దయ్య వీధిలో సింహాద్రి అప్పన్న కోదండ రామాలయ పునః నిర్మాణంలో భాగంగా సోమవారం ఉదయం 9.42 నిమిషాలకు నూతన విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గనిరెడ్డి శివకుమార్, సూర్యకళ దంపతులచే వేద మంత్రాలతో అర్చకులు, ఘనాపాటీలు కోదండ రాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రామయ్యను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మెంటే పార్థసారథి, తోట భోగయ్య, వానపల్లి సూరిబాబు, గనిరెడ్డి త్రినాథ్, నల్లం రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ వైస్ చైర్‌పర్సన్‌గా స్వరాజ్యలక్ష్మి



డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి

సాక్షి, భీమవరం : ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉమెన్ డాక్టర్స్ వింగ్ వైస్ చైర్‌పర్సన్‌గా, మిషన్ పింక్ హెల్త్ వైస్ చైర్‌పర్సన్‌గా భీమవరం పట్టణానికి చెందిన డాక్టర్ మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తనకు నియామక పత్రాలను పంపినట్లు ఆమె చెప్పారు. ఈసందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎనీమియా అవగాహన సదస్సుల నిర్వహణ, మహిళల ఆరోగ్యానికి కృషిచేస్తానని చెప్పారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

భీమవరం అర్బన్ : ఈ వేసవిలో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే రక్షిత మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రామచంద్ర ప్రభు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేవారిని ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా ఇంటిపన్నులు వసూళ్లలో వేగం పెంచాలన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మోగల్లులో వైద్య శిబిరం

పాలకోడేరు : భీమవరంలోని సాగి రామకృష్ణంరాజు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మోగల్లులో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. విష్ణు డెంటల్ కాలేజ్ వారిచే ఈ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.

హుండీ లెక్కింపు

భీమవరం(ప్రకాశంచౌక్) : పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 59 రోజులకుగాను రూ.3,63,880 నగదు వచ్చిందని ఈఓ గంగా శ్రీదేవి తెలిపారు.

కడలి గంగిశెట్టి మృతి



కడలి గంగిశెట్టి

వీరవాసరం : సీపీఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు కడలి గంగిశెట్టి (95) సోమవారం సాయంత్రం 5 గంటలకు తుది శ్వాస విడిచారు. పశ్చిమగోదావరి జిల్లా గీత కార్మిక ఉద్యమంలో ఆయన ఎన్నోపోరాటాలు చేశారు. జిల్లా సీపీఐ సెక్రటరీ కోనాల భీమారావు చల్లబోయిన రంగారావు, డీవీఎస్ వర్మ, నెక్కంటి సుబ్బారావు, వడ్డీ సుబ్బారావు, అయినపూడి బాబురావు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ఉపాధి పనులపై విచారణ

పాలకోడేరు : ఉపాధి హామీ పథకం కింద 2021-2022 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకుగాను ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు సామాజిక తనిఖీ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో గంగాధరరావు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులపై ఈ నెల 28న కార్యాలయంలో విచారణ జరుపుతామని ఎంపీడీవో తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వసంత నవరాత్రులు

పెనుగొండ: వసంత నవరాత్రులు పెనుగొండ కంచికామాక్షీ ఆలయంలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆరో రోజు సోమవారం వాసవీ గీతా మహిళా సమాజం, కామాక్షీ మహిళా సేవా సంఘాల ఆధ్వర్యంలో గులాబీలతో అభిషేకం, కుంకుమతో లలితా త్రిశతి నామార్చన, లలితా అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్పందనలో 4 ఫిర్యాదులు

ఆకివీడు : స్పందన కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ఎస్ఎస్ శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామం నుంచి పారీఖత్తుల వివాదంపై రెండు ఫిర్యాదులు, దుంపగడప గ్రామంలో రహదారి సమస్య, స్థానిక జాతీయరహదారి ప్రాంతంలోని ఎంపైయిర్ టవర్ వద్ద నుంచి మూలలంక బోదె వరకూ డ్రెయినేజీ నిర్మించాలని ఫిర్యాదులు అందాయని శ్రీకర్ తెలిపారు. ఫిర్యాదుల్ని ఆయా డిపార్టుమెంట్‌కు బదలాయించామన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ

ఆకివీడు : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షా కేంద్రాలను సిటింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు సోమవారం తనిఖీ చేశాయి. ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షల్ని మండలంలోని మూడు కేంద్రాల్లో 580 మంది రాశారు. 33 మంది గైర్హాజరయ్యారు. దుంపగపడలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సిటింగ్ స్క్వాడ్, కాకతీయ జూనియర్ కాలేజీ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీలలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశాయి.

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 104



యండగండిలో 104 కొత్త వాహనాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి : ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం ఉండి మండలం యండగండి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 104 కొత్త వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు అందించిన గొప్ప సంజీవని 108 అని దానిని గత పాలకులు కనీసం నియోజకవర్గానికి ఒక్క 108 వాహనాన్ని నిర్వహించలేదని అన్నారు. కానీ ఇప్పుడు 108 అంబులెన్స్‌తో పాటు గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 104 వాహన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుంటున్నారని అన్నారు. 104 వాహనాల ద్వారా ప్రతి గ్రామంలోను ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సామాన్య ప్రజలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యాన్ని, బీపీ, షుగర్ రోగులను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు. అలాగే వారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇంటివద్దనే ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో కాళ్ళ, యండగండి పీహెచ్‌సీలకు 104 వాహనాలు సమకూర్చడం ద్వారా గతంలో ఒక్కసారి మాత్రమే గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసేవారని ఇప్పుడు నెలకు రెండుసార్లు గ్రామాల్లో వైద్య శిబిరాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వేగేశ్న వేణు, మంతెన రాము, టీవీ రాము, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ డీ బెన్నీసామ్యూల్, డాక్టర్ కీర్తన, డాక్టర్ నరసరాజు, ఎంపీహెచ్ఓ ఐజయ్య, రత్నరాజు, పీహెచ్ఎన్ వెంకటరమణ, వైద్య సిబ్బంది లక్ష్మీ,కుమారి, కృష్ణవేణి, సువార్త, దుర్గాభవానీ, లత తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కవచంలా హెల్మెట్



దిగమర్రు బైపాస్‌రోడ్డులో హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పాలకొల్లు అర్బన్: హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ కవచంలా పని చేస్తుందని సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అన్నారు. పాలకొల్లు మండలం దిగమర్రు జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో సబ్ కలెక్టర్ సూర్యతేజ పాల్గొని వినియోగదారులకు పలు సూచనలు చేశారు. చాలా ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని పోలీస్ నివేదికలు చెబుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఉండడం వల్ల తలకు గాయాలు కాకుండా రక్షించుకోవచ్చన్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు మరలా తిరిగి వెళ్లేవరకు తమపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు. ఈ అవగాహన సదస్సులో సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్, యలమంచిలి ఎస్సై జేఎస్ ప్రసాద్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ విజయరత్నం

ఆకివీడు : మీ ఆరోగ్యం, మీ చేతుల్లోనే ఉందని సీడీపీఓ ప్రాజెక్టు అధికారిణి విజయరత్నం చెప్పారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో సోమవారం పోషణ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోషక విలువలు కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో పోషకాలున్న ఆహారం అందజేస్తోందని చెప్పారు. ఆహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఎనీమియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పడాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, స్కూళ్లలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవగాహన కల్పిస్తున్నామని విజయరత్నం చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

కాళ్ల : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కాళ్లకూరు గ్రామంలో నల్ల రిబ్బన్లు , కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణచివేసే దిశగా నరేంద్ర మోడీ పాలన సాగుతోందన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. వారు చేస్తున్న అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించాలని రాహుల్ గాంధీ డిమాండ్‌ని కప్పిపుచ్చుకునే చర్యలో భాగంగా ఈ అనర్హత వేటు వేశారని ఆరోపించారు. దీనిపై దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అందరూ కలిసి ఈ చర్యని ఖండించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన

కాళ్ల : కాళ్లకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కిశోర బాలికలకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకివీడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జువ్వలపాలెం సెక్టార్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ సాధు శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినిలకు పలు సూచనలు చేశారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకొవాల్సిన పలు జాగ్రత్తల గురించి వారికి అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, సంరక్షణపై అవగాహన కల్పించారు. మహిళలకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలు, దిశ యాప్ లపై అవగాహన కల్పించారు. అనంతరం 'పోషణ్ పక్వాడ' పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరగలమ్మ డ్రెయిన్ ప్రక్షాళనకు చర్యలు



సిద్ధాంతంలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మాజీమంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: సిద్ధాంతంలో సమస్యాత్మకంగా మారిన గరగాలమ్మ డ్రెయిన్‌ను సత్వరం ప్రక్షాళన చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. ఇటీవల సిద్ధాంతంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి సిద్ధాంతం ప్రజలు గరగాలమ్మ డ్రయిన్ ముంపు సమస్యను తీసుకువచ్చారు. సోమవారం సిద్ధాంతంలో ఆయన పర్యటించి డ్రెయిన్ పరిశీలించారు. సత్వరం పూడిక పనులు చేపట్టాలని, డ్రెయిన్ ఆక్రమణలు తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇలపర్రులో రహదారిలో ప్రవహించే మురుగు డ్రెయిన్ పూడిక పనులు చేపట్టాలన్నారు. సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగకంగా ఉన్న చెరువు పూడిక పనులకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు,యర్రంశెట్టి బుజ్జి, సొసైటీ చైర్మన్ బలువు కృష్ణమూర్తి, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, ఏఎంసీ డైరక్టరు కుసుమే రాంబాబు, పార్టీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కంకిపాటి డేవిడ్, దంపనబోయిన బాబూరావు, నక్క కృష్ణ, సామ్యూల్, కొండయ్య, బలువు కేదారి, సుతాపల్లి సత్తిబాబు, కుడిపూడి రామకృష్ణ, కేశవరపు గణపతి, పూరెళ్ల శ్రీను, కడలి శ్రీను, కుడిపూడి సుబ్రహ్మణ్యం, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా అధ్యక్షురాలిగా విమల

పాలకొల్లు అర్బన్: బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా పెచ్చెట్టి లక్ష్మీ విమలను వ్యవస్థాపక అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేష నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మీ విమలను పాలకొల్లుకి చెందిన బీసీ సంఘ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీల కతీతంగా బీసీ సామాజిక ప్రయోజనాలకు తన వంతు కృషి చేస్తానని లక్ష్మీ విమల తెలిపారు. ఈకార్యక్రమంలో పైలా రాజశ్రీ, కుసుమే ఝాన్సీ హేమలత, పితాని లక్ష్మి, వి భరణి, కాసా విజయ భవాని, డి లక్ష్మి, మాముడూరు మణి, షేక్ వలీయ, సత్యసుధాకర్, రాయపూడి భవాని ప్రసాద్, స్వయంవరపు శ్రీమన్నారాయణ తదితరులు విమలను అభినందించారు.

కవితా పోటీల్లో విజేత డాక్టర్ బాల చందర్

పెనుగొండ: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా పోటీల్లో పెనుగొండకు చెందిన కవి, రచయిత, గాయకుడు తెలుగు శాఖాధిపతి, మానవత అధ్యక్షుడు డాక్టర్ బాలచందర్ విజేతగా నిలిచారు. సోమవారం పెనుగొండలో ఆయన వివరాలు తెలియజేశారు. మహిళా సాధికారత అంశంపై 150 మంది కవులు పాల్గొనగా, టాప్ 20లో విజేతగా నిలిచినట్లు తెలిపారు. సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న, ట్రస్టు చైర్మన్ బోయి హైమావతి, కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జి ఈశ్వరి భూషణం చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. విజేత బాల చందర్‌ను పలువు అభినందించారు.

బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నూతన కమిటీ ఎన్నిక



బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) జిల్లా నూతన కార్యవర్గం సోమవారం భీమవరంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక అంబేడ్కర్ భవనంలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు ముఖ్య అతిథిగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తాడిపర్తి సంపతరావు, కొల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీఎస్ఐ కమిటీలను ఏర్పాటుచేసి జిల్లాలో బౌద్ధాన్ని విస్తరింపచేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబును సత్కరించారు.

31న ఉండి కోఆపరేటివ్ బ్యాంక్ మహాజన సభ

ఉండి : ఉండి విశాల సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశాన్ని బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జీఏవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ సభలో కొత్త సభ్యుల చేరికను ఆమోదించుట, జమాఖర్చులు, 2023-24 బడ్జెట్‌ను ఆమోదించడంపై చర్చిస్తామన్నారు. ఈ మహాసభకు సంఘ సభ్యులంతా తప్పక హాజరు కావాలని కార్యదర్శి తెలిపారు.

31న మండల పరిషత్ సమావేశం

పాలకోడేరు : పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ భూపతి రాజు చంటిరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూకల మురళి గంగాధర్ రావు తెలిపారు. కావున ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

భీమవరం(ప్రకాశంచౌక్) : భీమవరం మున్సిపాలిటీకి, ఒక ప్రైవేటు విద్యాసంస్థకు ఆస్తిపన్ను విషయమై దశాబ్దకాలంగా కోర్టులో కేసు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ మినహాయింపు విషయాన్ని ఆయా యాజమాన్యం వారికి వివరించగా రూ.47,19,855 ఆర్‌టీజీఎస్ ద్వారా అసలు మొత్తం చెల్లించారు. ఈ సందర్భంగా భీమవరం కమిషనర్ సబ్బి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ మినహాయింపును పన్ను చెల్లింపు దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా 3 రోజులు మాత్రమే సమయం ఉందని, పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు లబ్ధి పొందాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్వో డి.సోమశేఖర్, ఆర్ఐ ఎస్.కృష్ణమోహన్, అడ్మిన్ సెక్రెటరీ టి.మాణిక్యం తదితరులున్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నరసన్నచెరువుపాలెం గ్రామ మహిళలు

సాక్షి, భీమవరం : అక్కచెల్లెమ్మలకు సంక్షేమ పథకాలు అమలుజేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం కొణితివాడ పంచాయతీ నరసన్నచెరువుపాలెం గ్రామస్తులు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. మహిళలు స్వశక్తితో ఎదగడానికి కుట్టు మెషీన్లు పంపిణీ చేయాలని, గ్రామంలో చెత్తను తరలించడానికి ట్రాలీ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గానాగమల్లేశ్వరరావు(బాబు), మల్లుల అర్జునుడు, బొంతు సత్యలక్ష్మీదుర్గ, పద్మజ, వీరవల్లి దుర్గారాధ తదితరులున్నారు.

104 వాహనాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో

భీమవరం(ప్రకాశంచౌక్) : భీమవరం గొల్లవానితిప్ప పీహెచ్‌సీకి సంబంధించిన నూతన 104 వాహనాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత 104 వాహనాల ఉపయోగం కీలకమన్నారు. గొల్లవానితిప్ప పీహెచ్‌సీ నుంచి 11 గ్రామాలకు ఈ 104 వాహనం సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి సత్యనారాయణ రాజు, డాక్టర్ సుగుణ రాజు, సుధా తదితరులు పాల్గొన్నారు.

190 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

భీమవరం అర్బన్ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని సర్పంచ్ కలిదిండి సుజాత అన్నారు. శ్రీరామపురం గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 190 పశువులకు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలిదిండి ఫణిరాజు, గ్రామ వెటర్నరీ వైద్యులు, పశు పెంపకం దారులు, రైతులు పాల్గొన్నారు. రాయలం గ్రామంలో మంగళవారం ఉదయం 7.30 నుంచి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు తెలిపారు.

దూషించిన వ్యక్తుల అరెస్ట్

వీరవాసరం : సర్పంచ్‌ను కులం పేరుతో దూషించిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.రమేష్ సోమవారం తెలిపారు. రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతిని భర్త భాస్కర్‌రావులను కులం పేరుతో దూషిస్తూ, ఆలయ ప్రవేశం లేకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని పినపరెడ్డి పెద్దిరాజు, పినపరెడ్డి నాగాంజనేయులపై ఫిర్యాదు అందిన నేపథ్యంలో విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.